జగిత్యాల జైత్రయాత్ర
నారాయణ కన్నుమూత

- తొలితరం నక్సలైట్ ఉద్యమకారుల్లో ఒకరు
- బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు సంతాపం

నారాయణ (ఫైల్)

జగిత్యాల, మే 17 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జైత్రయాత్ర నిర్మాతల్లో ఒకరైన పండుగ నారాయణ (75) కన్నుమూశారు. మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ నెల 15న తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1968లో పీయూసీ చదివిన నారాయణ కొంతకాలం ప్రైవేట్ స్కూల్ నడిపారు. ఆ తరువాత నక్సలైట్ల ఉద్యమంలో చేరారు. ఎమర్జెన్సీలో రహస్య జీవితం గడిపి, తర్వాత కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి రావడంతో బహిరంగ ప్రజాఉద్యమాల నిర్మాణం చేపట్టారు. విద్యార్థులు, యువత, రైతుకూలీల్లో ఆయన రగిలించిన చైతన్యంతో వారంతా భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించారు.జూలై 17న ఏర్పాటుచేసిన రైతుకూలీ సంఘం మహాసభ, జగిత్యాల జైత్రయాత్రగా ప్రసిద్ధి పొందింది. దీనివెనుక నారాయణ కీలకపాత్ర పోషించారు. జగిత్యాల జైత్రయాత్ర యాత్ర అనంతరం జగిత్యాల, సిరిసిల్ల తాలూకాలను నాటి ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించింది. అనేక కేసుల కారణంగా ఆయన జైలు జీవితం గడిపి 1984 ఫిబ్రవరిలో బయటకు వచ్చారు. అనంతరం హైదరాబాద్‌కు మకాం మార్చిన నారాయణ ఏపీఎస్ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. కొన్నాళ్లకు స్వగ్రామం చేరుకొని అక్కడే స్థిరపడ్డారు.

మావోయిస్టుల అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న ములుగు ఎస్పీ శబరీశ్

20 మంది మావోయిస్టుల అరెస్టు

- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ వెల్లడి

ములుగు, మే17(నమస్తేతెలంగాణ) : నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 20 మందిని శనివారం ములుగు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ డాక్టర్ శబరీశ్ ములుగులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు), వాజేడు, పేరూరు పోలీస్ స్టేషన్ పరిధితో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఎలిమిడి, ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు గ్రూప్‌లుగా విడిపోయి అడవిలో సంచరిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. శుక్రవారం వెంకటాపురం పీఎస్ పరిధిలో పాలెంవాగు ప్రాజెక్టు వద్ద మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యులు కుంజం లక్క, మారిగల సుమతి, పార్టీ సభ్యులు మడకం కోసి, పొడియం జోగి, మడవి సీమ, ముసాకి రంజును అరెస్ట్ చేశారు. మురుమూరు వద్ద డివిజన్ కమిటీ సభ్యుడు కట్టం భీమ్, ఏరియా కమిటీ సభ్యురాలు మడకం మాసే, పార్టీ సభ్యులు సోడి ఉంగి, వంజాం ముకే, హేమల సుక్కి, కుంజం ఉంగా, పూనెం భీమేను అరెస్టు చేశారు. గుట్టల గంగారం గొత్తికోయగూడెంలో ఏరియా కమిటీ సభ్యుడు కట్టం జోగా, పార్టీ సభ్యులు పూనెం భీమే, నుపా గంగి, హేమల సన్నీ, ఊకె మాసా, పొడియం లక్క, ఉండెం సోమడు ఉన్నట్టు పేర్కొన్నారు. వీరి నుంచి మూడు 6 ఎంఎం రైఫిల్, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 303 రైఫిల్, నాలుగు 8 ఎంఎం రైఫిల్, 12 బోర్ వెపన్స్, రెండు గ్రనైట్స్, 17 మ్యాగజైన్‌లు, 180 రౌండ్ల బుల్లెట్స్‌తోపాటు రూ.58,155, నాలుగు వాకీటాకీలు, ఆరు రేడియోలు, 9 చార్జింగ్ బ్యాటరీలు, ఆరు పెన్‌డ్రైవ్‌లు, ఆరు మెమొరీ కార్డులు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు.



ఏఐతో ఉద్యోగాలు పోతాయన్నది అపోహే

- పాత పద్ధతిలో ఉద్యోగాలు చేస్తామంటే కుదరదు
- ఐటీ ఉద్యోగులు ఎప్పటికప్పుడు అప్డేట్ కావాల్సిందే
- అన్ని రంగాల్లోనూ పట్టభద్రులు అవసరమే
- ఇంజినీరింగ్‌లో ఏ కోర్సు చేసినా ఉద్యోగం పొందొచ్చు
- సాఫ్ట్‌వేర్ వైపు సివిల్, మెకానికల్ ఇంజినీర్ల మొగ్గు
- నిర్మాణ, తయారీ రంగాల్లో ఇంజినీర్లు దొరకని పరిస్థితి
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ రమేశ్ లోగనాథన్

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయనేది అపోహ మాత్రమే అని ఐఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ రమేశ్ లోగనాథన్ స్పష్టం చేశారు. ఐటీ రంగంలో ఉద్యోగస్తులు కొత్త టెక్నాలజీకి తగ్గట్టుగా అప్డేట్ కావాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లోని మొత్తం 10 లక్షల మంది ఐటీ ఉద్యోగుల్లో 20-30 వేల మంది మాత్రమే ఏఐని ఉపయోగించి పనిచేస్తున్నారని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యపై ఏఐ ఎలాంటి ప్రభావం చూపదని.. సివిల్, మెకానికల్ ఇంజినీర్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అయినట్టే ఇంజినీరింగ్‌లో ఏ కోర్సు చేసినా దర్జాగా ఏఐ ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో పట్టభద్రుల అవసరం ఉన్నదని, నిర్మాణ, తయారీ రంగాల్లో సివిల్, మెకానికల్ ఇంజినీర్లు దొరకని ఆందోళనకర పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సేవలు విస్తృతంగా వ్యాపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఐటీ రంగంతోపాటు ఇంజినీరింగ్ విద్యపై ఏఐ ఏ మేరకు ప్రభావం చూపనుందనే అంశంపై 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

నమస్తే తెలంగాణ: ఐటీ రంగంపై ఏఐ ప్రభావం ఎలా ఉండబోతున్నది?

రమేశ్ లోగనాథన్: కృత్రిమ మేధతో ఐటీ రంగానికి తక్షణ నష్టమేమీ ఉండదు. దాని వల్ల మనకు కొత్త అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని 2016, 2020లో సైతం వార్తలు వచ్చాయి. గత రెండేండ్ల ఆ వదంతులు ఎక్కువయ్యాయి. ప్రస్తుత పరిస్థితులు మనకు అనుకూలంగా మారేందుకు కాస్త సమయం పడుతుంది. కొన్ని విభాగాల్లో మాత్రమే అవకాశాలు తగ్గి మరికొన్నింటిలో పెరుగుతాయి. చాట్ జీపీటీ వల్ల జాబ్స్ పోతాయని గతంలో ప్రచారం జరిగినప్పటికీ ఎక్కడా అలా జరగలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యక్షంగా 10 లక్షల మంది ఐటీ ఉద్యోగులుండగా, వీరిలో 6 లక్షల మంది ఐటీ డెవలపర్లు ఉన్నారు.

నమస్తే తెలంగాణ: ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే చర్చ నడుస్తున్నది కదా?

రమేశ్ లోగనాథన్: ఉదాహరణకు బ్యాంకింగ్ వ్యవస్థను తీసుకుంటే ఆ రంగంలో ఓ సిస్టమ్‌ను డెవలప్ చేసి దాన్ని వినియోగించేందుకు కనీసం వెయ్యి మంది ఉద్యోగులు అవసరమవుతారు. వారు చేసే పని అస్సలు మారదు. అక్కడక్కడా ఏఐ సేవలను మాత్రం వినియోగించుకుంటారు. ఓ 20-30 మంది చేసే పనులను ఏఐతో చేయిస్తారు. ఏఐ కారణంగా ఏటీఎం నుంచి డబ్బులు విత్‌డ్రా చేసే పద్ధతితోపాటు ప్రధాన బ్యాంకింగ్ వ్యవస్థలో ఎలాంటి మార్పులు ఉండవు. ఆ సిస్టమ్‌ను ఇప్పటికే 30-40 ఏండ్ల నుంచి వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో ఏఐని వినియోగించి ఆన్‌లైన్ మోసాలను గుర్తించే అవకాశం ఉన్నది. అందుకోసం కొంత మంది ఏఐ నిపుణులు పనిచేస్తారు. అదనపు పనులకే ఏఐని వినియోగిస్తారు తప్పా ముందు నుంచి ఉన్న పనిలో, సిస్టమ్‌లో ఎలాంటి మార్పు ఉండదు. కొత్తగా ఏ టెక్నాలజీ వచ్చినా మనం చేసే పనుల్లో 90-95 శాతం మేరకు ఎలాంటి మార్పు ఉండదు. ఏఐ వల్ల ఐటీ రంగంలో ఉద్యోగాలు పెరగలేదు. అలా అని తగ్గనూలేదు. గత 3-4 ఏండ్ల నుంచి ఏం జరుగుతున్నదో ఈ ఏడాది కూడా అదే జరుగుతున్నది.

నమస్తే తెలంగాణ: కోడింగ్ పనుల కోసం బడా ఐటీ కంపెనీలతోపాటు స్టార్టప్‌లు సైతం ఏఐని వినియోగిస్తుండటాన్ని ఎలా చూడొచ్చు?

రమేశ్ లోగనాథన్: ఈ పరిణామం కొత్తదేమీ కాదు. గత 5-10 ఏండ్ల నుంచి పనిచేస్తున్న నిష్ణాతులైన డెవలపర్లకు మంచి రిసోర్స్‌లు ఉన్నాయి. 'స్టాక్ ఓవర్ ఫ్లో' సైట్ మనకు చాలా రోజుల నుంచి అందుబాటులో ఉన్నది. అందులోకి వెళ్లి ఫలానా సాఫ్ట్‌వేర్ తయారీకి కోడ్ కావాలి అని సెర్చ్ చేస్తే అది కోడ్‌ను మనకు చూపిస్తుంది. ముందు నాలుగైదు వేర్వేరు ప్రోగ్రామ్‌లను తీసుకుని కోడ్‌లను చూసి మనం రాయాల్సి ఉండేది. ఇప్పుడు ఏఐ కారణంగా ఆ సమయం ఆదా అవుతుంది. అయితే ముందు నుంచే మనకు శాంపిల్ కోడ్ అందుబాటులో ఉన్నది. వంద మంది డెవలపర్లు చేసే మొత్తం పనిని ఏఐతో పూర్తిచేసే టెక్నాలజీ ఇంకా రాలేదు. అయితే ఒక డెవలపర్ చేసే పనిలో ఏఐ టూల్ ఓ రిసోర్స్‌గా ఉంటుంది. ఏఐ వచ్చిన తర్వాత టెక్నాలజీ మెరుగుపడింది. 25-30 ఏండ్ల క్రితం సాఫ్ట్‌వేర్ కోడ్ మొత్తాన్ని డెవలపర్లే రాసేవారు. 15 ఏండ్ల క్రితం కోడ్‌ను రాసేటప్పుడు ఎంఎస్ వర్డ్‌లో సెంటెన్స్ కరెక్షన్ ఆప్షన్ వచ్చినట్టే కోడ్ కరెక్షన్ ఆప్షన్ వచ్చింది. 10 ఏండ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు కోడింగ్ మరింత సులుభమైంది. ప్రస్తుతం కోడ్‌ను రాయడంలో ఏఐ సహాయపడుతున్నది. ఇప్పటివరకు ఉన్న టెక్నాలజీతో పోలిస్తే ఏఐ మెరుగైనదే అయినప్పటికీ దాన్ని మనం సాధనంలానే వినియోగించుకోవాల్సి ఉంటుంది.

నమస్తే తెలంగాణ: ముఖ్యమైన కోడింగ్‌లకు మున్ముందు మనుషుల అవసరం ఉండదన్న అంచనాలు ఉన్నాయి కదా?

రమేశ్ లోగనాథన్: గత ఏడాదిన్నరగా ఏఐ టూల్స్ అందుబాటులో ఉన్నాయి. ఏఐతో తమకు ఉపయోగం ఉందని చెప్తున్న వారిలో ఇప్పటివరకు కనీసం ఒక్కరిని కూడా ఉద్యోగం నుంచి తొలగించిన దాఖలాలు లేవు. టూల్స్ ఆధారంగా కోడ్‌ను రాసే విధానం గత 25 ఏండ్ల నుంచి ఉన్నది. అది ఏటేటా మెరుగుపడుతూనే ఉంటుంది. ఉద్యోగులు పదేండ్ల క్రితం పనిచేసినట్టు ఇప్పుడు పనిచేస్తామంటే కుదరదు. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు ఎప్పటికప్పుడు అప్డేట్ కావాల్సి ఉంటుంది. లేకుంటే వారికి భవిష్యత్తు ఉండదు. ఏఐ టెక్నాలజీ వల్ల ఎవరికీ ఉద్యోగాలు పోయే అవకాశం లేదు. అప్డేట్ అవ్వనివారికి మాత్రం ఉద్యోగాలు పోతాయనడంలో సందేహం లేదు.

నమస్తే తెలంగాణ: ప్రస్తుతం ఇంజినీరింగ్‌లో ఏ కోర్సులు చేస్తే బాగుంటుంది?

రమేశ్ లోగనాథన్: కాలేజీల్లో నాలుగు రకాల ఏఐ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 90-95 శాతం కోర్సులు ఒకేలా ఉంటాయి. సర్టిఫికెట్‌లో డిగ్రీ మాత్రమే వేరుగా ఉంటుంది. వారంతా చదివేది కంప్యూటర్ సైన్సే. ఏ కోర్సు చేసినా ఇబ్బందేమీ ఉండ దు. ప్రస్తుతం మనకు ఏఐపై మంచి పట్టున్న లెక్చరర్లు అందుబాటులో లేరు. దీంతో కంప్యూటర్ సైన్స్ పాఠ్య ప్రణాళికలో 5 శాతం మార్పు చేసి ఏఐ విద్యను బోధిస్తున్నారు.

నమస్తే తెలంగాణ: భవిష్యత్తులో ఐటీ ఇంజినీర్ల అవసరం చాలా తగ్గుతుందని నిపుణులు చెప్తుండటంపై మీ స్పందన ఏమిటి?

రమేశ్ లోగనాథన్: ఏఐ కారణంగా ఓ ఐదేండ్లలో ఇంజినీర్ల అవసరం తగ్గుతుందనుకుంటే ఈ ఏడాది ఇంజినీరింగ్ చదివే వాళ్ల సంఖ్య తగ్గాలి కదా? అలా జరగలేదంటే దాని ప్రభావం లేదనే అర్థం. భవిష్యత్తులో ఇంజినీర్ల అవసరం తగ్గుతుందని కొందరు వాదిస్తున్నప్పటికీ అందుకు సరైన ఆధారాలేమీ లేవు. నిపుణులు అభిప్రాయపడినట్టు టెక్నాలజీ ఆ రేంజ్‌లో ఏమీ లేదు. గతంలో చాట్ జీపీటీ గురించి ఇలాంటి వాదనలు తెరపైకి వచ్చాయి. మనం చేసే రిసెర్చ్‌లో మాత్రమే ఇలాంటి టూల్స్ ఉపయోగపడతాయి. గతంలో మనం గూగుల్‌లో సమాచారాన్ని తెలుసుకునే వాళ్లం. ఇప్పుడు చాట్ జీపీటీ లాంటి వాటితో సమయం ఆదా అవుతుందేమో కానీ మనం చేయాల్సిన పని ఏమాత్రం తగ్గదు. కొన్ని విభాగాల్లో ఈ టూల్స్ ఉపయోగపడతాయే తప్ప మొత్తం పనిని అవే చేయలేవు.

నమస్తే తెలంగాణ: ఏఐ విస్తృతంగా వ్యాపిస్తున్న ప్రస్తుత తరుణంలో మన విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలి?

రమేశ్ లోగనాథన్: ప్రస్తుతం నిర్మాణ, తయారీ రంగాల్లోని కంపెనీలకు సివిల్, మెకానికల్ ఇంజినీర్లు దొరకని పరిస్థితి నెలకొన్నది. అక్కడ పనిచేసే ఇంజినీర్లు తమ ఉద్యోగాలను వదిలేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నారు. దీంతో అన్ని విభాగాల్లో మనకు పట్టభద్రులు చాలా అవసరం. సివిల్ ఇంజినీర్లకు రూ.30-40 వేల ప్రారంభ వేతనం ఉన్నప్పటికీ తమ పిల్లలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే చేయాలనే దృక్పథం చాలా మంది తల్లిదండ్రుల్లో ఉన్నది. ప్రస్తుతం మన దేశంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు ఇస్తున్న సగటు ప్యాకేజీ రూ.3 లక్షలే. అంటే.. వారి నెలవారీ జీతం రూ.25 వేలు మాత్రమే. సివిల్ కంపెనీలు ఇంతకు మించి వేతనాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. సివిల్, మెకానికల్ ఇంజినీర్లు సాఫ్ట్‌వేర్‌లో రాణిస్తున్నారు. అదేవిధంగా ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ చేసినవారు దర్జాగా 'ఏఐ'లో జాబ్‌లు చేయొచ్చు. ఆ ఉద్యోగాలు చేయడానికి కేవలం ఏఐ స్పెసిఫిక్ ఇంజినీరింగ్ డిగ్రీ మాత్రమే ఉండాల్సిన అవసరం లేదు. ఇంజినీరింగ్‌లో ఏ కోర్సు చేసినా ఏఐలో ఉద్యోగాలు పొందవచ్చు. ఇంజినీరింగ్ విద్యార్థులు స్కూల్‌కు వెళ్లి చదివినట్టు చదువుతున్నారు. ఇంజినీరింగ్ విద్య అంటే భవనాలు నిర్మించడం, యంత్రాలు, సాఫ్ట్‌వేర్లు తయారు చేయడమే. కానీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితి అలా లేదు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఏఐ నేర్చుకుంటున్నారా లేదా అనేది సమస్యే కాదు. వారిని స్టార్టప్‌ల వైపు మళ్లించి నిష్ణాతులుగా మార్చాల్సిన అవసరం ఉన్నది.

జవాన్ భూమి కబ్జా

- న్యాయం చేయాలని వేడుకోలు
- స్పందించిన మాజీమంత్రి హరీశ్
- చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు ఫోన్

జవాన్ బూరు రామస్వామి

దుబ్బాక, మే17 : దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పోరాటం చేస్తుంటే.. స్వగ్రామంలో తన భూమికి రక్షణ లేకుండా పోయిందని సోషల్ మీడియాలో ఓ జవాన్ తన ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లికి చెందిన జవాన్ బూరు రామస్వామి కశ్మీర్ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్నాడు. రామస్వామి ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ప్రాణాలకు తెగించి కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తుంటే, స్వగ్రామంలో తన కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని వీఆర్వో రమేశ్, అతడి సోదరుడు కలిసి రికార్డుల్లో లేకుండా చేసి, తన తల్లిదండ్రులు శామవ్వ, వెంకటయ్యను బెదిరిస్తున్నారని తెలిపాడు. వీడియోను చూసిన మాజీమంత్రి హరీశ్‌రావు స్పందించి వెంటనే కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి చౌదర్‌పల్లిలో సైనికుడి కుటుంబానికి చెందిన భూమిని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
ఏబీవీపీ డిమాండ్

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. శనివారం తెలంగాణ ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి ఏబీవీపీ బృందం వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వీతేజ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడేండ్లకు ఒకసారి పెరిగే ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులను ఇష్టారీతిన పెంచడానికి ప్రతిపాదనలు పంపిన టీఏఎఫ్ఆర్సీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కళాశాలలు తప్పుడు ఆడిట్ లెక్కలు చూపిస్తూ ఫీజులు పెంచుకొని పేద విద్యార్థుల దగ్గర లక్షలకు లక్షలు డబ్బులు వసూలు చేయడానికి సిద్ధం అవుతున్నాయని ఆరోపించారు. తప్పుడు ఆడిట్ లెక్కలు చూపించిన కళాశాలలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు.

సింగిల్ విండోకి తూట్లు!

- ఫ్రెండ్లీ విధానానికి రాష్ట్ర సర్కార్ ఫుల్‌స్టాప్
- ఇబ్బందులు పడుతున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు
- తిరోగమన దిశగా రాష్ట్ర పారిశ్రామిక రంగం

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): పెట్టుబడిదారుల పట్ల స్నేహపూర్వక విధానాలు, అనుమతుల కోసం సింగిల్ విండో వ్యవస్థ... ఇదీ తెలంగాణ పారిశ్రామిక రంగం పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రత్యేక ముద్ర. అయితే ఇది ఒకప్పటి మాట. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పటినుంచి రాష్ట్రం ఈ ప్రత్యేకతను కోల్పోయిందనే ప్రచారం పరిశ్రమ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. భూ కేటాయింపులు లేక, అనుమతులు లభించక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భారీగా పెట్టుబడులు సాధిస్తున్నట్లు సర్కార్ ఊదరగొడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మరోలా ఉంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే టీఎస్ ఐపాస్(తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం) చట్టాన్ని ప్రవేశపెట్టిన విషయం విదితమే. నూతనంగా ఏర్పాటైన రాష్ట్రం కావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు రాష్ట్రాన్ని పరిశ్రమలకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో అప్పటి సీఎం కేసీఆర్ ఈ మేరకు వినూత్న చట్టానికి శ్రీకారం చుట్టారు. అంతేకాదు, ఈ నిర్ణయం వెనుక కూడా పెద్ద కసరత్తే జరిగింది. పారిశ్రామికవేత్తలతో సుమారు 9 గంటలపాటు సుదీర్ఘంగా చర్చించి.. వారు ఆలోచనలకు అనుగుణంగా ఈ చట్టానికి రూపకల్పన చేశారు. ఓ వైపు కొత్త పారిశ్రామికవాడలను అభివృద్ధి చేస్తూనే.. మరోవైపు ఉన్న పరిశ్రమలను కాపాడుకునేందుకు రెప్పపాటు కూడా కరెంటు పోకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మరోవైపు, పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ దేశ విదేశాల నుంచి పెట్టుబడులు రాబట్టేందుకు, ముఖ్యంగా బహుళ జాతి సంస్థలు రాష్ట్రంలో కొలువుదీరే విధంగా, వారు తమ పెట్టుబడులను మరింత విస్తరించుకునే విధంగా తనదైన శైలిలో విశేషంగా కృషిచేశారు.

కాగితాలకే పరిమితమైన టీజీ ఐపాస్....

పెట్టుబడిదారులు అనుమతుల కోసం ఎక్కడా తిరగకుండా పరిశ్రమకు అవసరమైన అన్ని శాఖల అనుమతులు ఒకే దరఖాస్తుతో ఆన్‌లైన్ ద్వారా లభించడమే టీజీ ఐపాస్ ప్రత్యేకత. పదేళ్లపాటు నిరాటంకంగా సాగిన ఈ చట్టం రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పటినుంచి గాడితప్పింది. ఇప్పుడా అనుమతుల జారీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. కనీసం దరఖాస్తులను పరిశీలించే వారు లేకుండా పోయారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు ఉంటేనే పరిశ్రమకు అనుమతులు మంజూరవుతున్నాయి. దీంతో టీజీఐపాసీలో వందలాది దరఖాస్తులు అటకెక్కాయి. అంతేకాదు, పెట్టుబడిదారులతో చర్చించి వారి సమస్యలు, డిమాండ్లను విని సానుకూల ధోరణితో పరిష్కరించే చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదు. గతంలో ఏ పారిశ్రామికవేత్త తనకు ఏ విధమైన సమస్య ఎదురైనా వెంటనే కేటీఆర్‌కు చెబితే క్షణాల్లో సమస్య పరిష్కారమయ్యేది. ఇప్పుడా స్నేహపూర్వక విధానం కనుమరుగై స్తబ్ధత నెలకున్నది.

దరఖాస్తుల పరిస్థితి ఇలా..

- గత 15 నెలల్లో అనుమతులు, భూమి కోసం వచ్చిన దరఖాస్తులు- **1,530**
- వీటిలో అనుమతులు మంజూరైనవి (సిఫారసుల ద్వారా)- **124**
- పెండింగ్‌లో ఉన్నవి- **1406**

- ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఓ పారిశ్రామికవాడలో రూ. 2 కోట్ల పెట్టుబడితో ఎంఎస్ఎంఈ యూనిట్‌ను నెలకొల్పడానికి ముందుకొచ్చిన ఓ ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు టీజీఐపాస్ అధికారులు చుక్కలు చూపించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసి ఆరు నెలలు ఆఫీసు చుట్టూ తిరిగినా ఆయనకు కనీసం ఉన్నతాధికారుల వద్ద అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదు. దీంతో చేసేదిలేక స్థానిక ఎమ్మెల్యేతో ఫోన్ చేయించుకుంటే ఆయనకు అర ఎకరం భూమి కేటాయించారు.
- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఓ ఇండస్ట్రియల్ పార్క్‌లో గతంలో భూమి కొనుగోలు చేసిన ఓ ఔత్సాహిక పారిశ్రామికవేత్త ఇటీవల అక్కడ షెడ్లు నిర్మించేందుకు వెళ్లగా ఓ స్థానిక కాంగ్రెస్ నేత అడ్డుకొని తన అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణాలూ చేయరాదని హుకుం జారీచేశారు. దీంతో సదరు పారిశ్రామికవేత్త భూమి కోసం తాను చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని గత మూడు నెలలుగా టీజీఐపాసీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.



- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో 1,000 గజాల జాగా కేటాయించాలని ఓ యువ పారిశ్రామికవేత్త సంవత్సరకాలంగా టీజీఐపాసీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అయితే, అతని ఆన్‌లైన్ దరఖాస్తును అధికారులు ఇంతవరకు పరిశీలించకపోగా, స్థలం కేటాయింపు చేస్తే ఆ సమాచారం తామే ఇస్తామని, ప్రతీసారి ఇలా కార్యాలయం చుట్టూ తిరగొద్దని అక్కడి అధికారులు ఉచిత సలహా ఇచ్చారు.
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఓ అద్దె భవనంలో చిన్నతరహా ఐటీ కంపెనీ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఓ ప్రవాస భారతీయుడు 4 నెలలుగా టీజీఐపాసీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అధికారులు రకరకాల కొర్రీలు వేస్తూ తిప్పుతున్నారు తప్ప పని కావడంలేదు. తాను ఇప్పటికే భవనానికి అడ్వాన్స్ చెల్లించి ఉద్యోగులను కూడా నియమించుకున్నట్లు చెప్పినా ఆయన మాట వినే నాథుడే లేడు.

రెడ్డీస్ ప్లాంట్లో తనిఖీలు

న్యూఢిల్లీ, మే 17: ప్రముఖ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌కు అమెరికాలో ఉన్న ప్లాంట్లో అమెరికా నియంత్రణ మండలి ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతోపాటు ఫామ్ 483ని జారీ చేశారు. న్యూయార్క్‌లో రెడ్డీస్‌కు ఉన్న ఏపీఐ యూనిట్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకు తనిఖీలు చేసినట్టు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది.

తగ్గిన టీవీఎస్ ఐక్యూబ్ ధర

న్యూఢిల్లీ, మే 17: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ కీలక నిర్ణయం తీసుకున్నది. తన ఎలక్ట్రిక్ స్కూటర్ మాడల్ ఐక్యూబ్ ధరను భారీగా తగ్గించింది. బ్యాటరీ కెపాసిటీని పెంచడంతోపాటు ధరను రూ.26 వేల వరకు దించింది. ఐక్యూబ్, ఐక్యూబ్ ఎస్ మాడళ్ల ధరలను రూ.16 వేలు తగ్గించిన సంస్థ..ఐక్యూబ్ ఎస్టీ మాడళ్లను రూ.26 వేలకు తగ్గించింది. దీంతో ఐక్యూబ్ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.31 లక్షలకు దిగిరాగా, గరిష్ఠ ధర రూ.1.59 లక్షలకు తగ్గింది. ఈ ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. అలాగే బ్యాటరీ కెపాసిటీని 3.4 కిలోవాట్ల నుంచి 3.5 కిలోవాట్లకు పెంచిన సంస్థ..మరో మాడల్‌ను 5.1 కిలోవాట్ల నుంచి 5.3 కిలోవాట్లకు పెంచింది. సింగిల్ చార్జింగ్‌తో ఐక్యూబ్ ఎస్ మాడల్ 145 కిలోమీటర్లు, ఐక్యూబ్ ఎస్టీ మాడల్ 212 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

మధ్యస్థాయి ఐటీ ఉద్యోగులకు
బంపర్ ఆఫర్

న్యూఢిల్లీ, మే 17: దేశీయ మధ్యస్థాయి ఐటీ ఉద్యోగుల పంటపండింది. గడిచిన నాలుగేండ్లలో వీరి వేతనాలు 30 శాతం వరకు పెరిగాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.7 లక్షలుగావున్న వార్షిక వేతనం గడిచిన ఆర్థిక సంవత్సరంనాటికి రూ.10 లక్షలకు పెరిగింది. ఇన్ఫోసిస్, విప్రో సంస్థలు వేతనాలను 30 శాతం వరకు పెంచగా...టెక్ మహీంద్రా, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, కాగ్నిజెంట్, యాక్సెంచర్‌లు ఉద్యోగులకు నిరాశనే మిగిల్చాయి.

సెక్రటేరియేట్ వద్ద యువకుడి హల్‌చల్!

- సెక్రటరియేట్ వద్ద ఇజ్రాయెల్ జెండాను తొలగిస్తున్న జకీర్
- ఇజ్రాయెల్ జెండా తొలగించిన నిందితుడి అరెస్ట్
- పోలీసులేం చేస్తున్నారంటూ నెటిజన్ల మండిపాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 17(నమస్తే తెలంగాణ): తెలంగాణ సెక్రటరియేట్ వద్ద నగరానికి చెందిన ఓ యువకుడు శనివారం హల్‌చల్ చేశాడు. 72వ మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో అక్కడ వివిధ దేశాల జెండాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వాటిలోని ఇజ్రాయెల్ జాతీయ పతాకాన్ని జకీర్ అనే యువకుడు తొలగించాడు. ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ జెండాను తొలగిస్తున్నట్టు ఈ సందర్భంగా నిందితుడు పేర్కొన్నాడు. ఘటన సమయంలో స్థానికులు తీసిన వీడియో వైరల్‌గా మారింది. అనంతరం గుర్తించిన అధికారులు తిరిగి ఇజ్రాయెల్ జెండాను ఏర్పాటు చేశారు. అదే యువకుడు ఆ జెండాను మళ్లీ తొలగిస్తూ లైవ్ వీడియో పెట్టాడు. దీంతో సైఫాబాద్ పోలీసులు స్పందించి నిందితుడు జకీర్‌పై కేసులు నమోదు చేశారు. జాతీయ జెండాను తొలగించే అగౌరవకరమైన చర్యగా పేర్కొం టూ క్రైమ్ నంబర్లు 138/2025, 141/ 2025 కింద రెండు కేసులు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక దేశ జెండాను తొలగిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. జకీర్ ఆ జెండాను తొలగించే క్రమంలో అతనికి సహకరించిన వారు కూడా ఉన్నారని, వారిపైనా కేసులు నమోదు చేయాలని, ఈ విషయంలో పోలీసులు సీరియస్‌గా వ్యవహరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఫొటోగ్రఫీ పేరుతో నీలిచిత్రాలు

- యువతులను వేధించి చిత్రీకరణ
- పోలీసుల అదుపులో నిందితుడు

ఎండీ ఎజాస్

మహబూబ్‌నగర్, మే 17 : ఫొటోగ్రఫీ పేరుతో సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్న కెమెరామన్ లీలలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎండీ ఎజాస్ అనే యువకుడు ఆరేండ్ల క్రితం బతుకుదెరువు కోసం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడకు వచ్చాడు. ఫిజా పేరుతో ఫొటో స్టూడియో నిర్వహిస్తూ, కోయిలకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో సహజీవనం చేస్తున్నాడు. స్టూడియోకు వచ్చే అమాయక యువతులను టార్గెట్ చేసి ఫొటోషూట్.. ఇన్‌స్టాగ్రామ్ వీడియోల పేరుతో ఎరవేసి సీక్రెట్‌గా నీలిచిత్రాలు చిత్రీకరించాడు. ఈ చిత్రాలతో సదరు యువతులను పలుమార్లు లైంగికంగా వేధించి, 20 మంది యువకులతో నీలిచిత్రాలు తీసినట్టు తెలిసింది. గురువారం ఓ యువతికి సంబంధించిన అశ్లీల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా సదరు యువతి బంధువులు, స్థానిక యువకులు అతడిపైదాడికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఫొటో స్టూడియోలో ఉన్న కంప్యూటర్, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు.

కరెంట్ వైర్లు అమర్చి.. పులిని హతమార్చి!

- చర్మం, గోర్లు తీసుకెళ్లిన వేటగాళ్లు!

కుమ్రంభీం ఆసిఫాబాద్,(నమస్తే తెలంగాణ)/కాగజ్‌నగర్, మే 17 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ ఎల్లూరు అటవీ ప్రాంతంలో ఏడేళ్ల వయసున్న ఆడపులిని వేటగాళ్లు కరెంట్ వైర్లు అమర్చి విద్యుత్తు షాక్‌తో హతమార్చి చర్మం, గోర్లు, వెంట్రుకలు తీసుకెళ్లినట్టు తెలిసింది. ఘటనా స్థలాన్ని శనివారం కవ్వాల్ వైల్డ్‌లైఫ్ డైరెక్టర్ శాంతారాం, ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ పరిశీలించారు. కళేబరం నుంచి షాంపిళ్లు సేకరించి ఖననం చేయించారు. కాగజ్‌నగర్‌లో శాంతారాం, నీరజ్‌కుమార్ వెలువరించిన వివరాల ప్రకారం.. పెంచికల్‌పేట్ అటవీ ప్రాంతంలో సంచరించే పులి ఈ నెల 13 నుంచి కనబడకుండాపోయింది. 16న ఉదయం ఎల్లూరు అటవీ ప్రాంతంలో వెతుకుతున్న అటవీ అధికారులకు నల్లగుట్ట అటవీప్రాంతంలో పులి కళేబరం కనిపించింది. దానిని పరిశీలించగా చర్మం, గోర్లు, వెంట్రుకలు (పులిమీసాలు) కనిపించలేదు. వేటగాళ్లు పులిచర్మాన్ని, గోర్లు, వెంట్రుకలను తీసుకెళ్లినట్టు అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. పులిని హతమార్చిన ఘటనలో ఎల్లూరు, మేడిగూడ, కొత్తగూడ, అగర్‌గూడ, కొమ్ముగూడకు చెందిన 30 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

కవ్వాల్ వైల్డ్‌లైఫ్ డైరెక్టర్ శాంతారాం, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్